క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సంస్థాన పూజ



సంస్థాన పూజను నిర్వహిస్తున్న వేదవర్ధన తీర్థ స్వామీజీ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని సంతపేట బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యాసరాజ మఠంలో సంస్థాన పూజను ఉడుపి శిరూర్ మఠ పీఠాధిపతి వేదవర్ధన తీర్థ స్వామీజీ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుధాపండితులు ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు సంస్థాన పూజ కార్యక్రమాలకు తోడ్పాటు అందించారు. భక్తులు విశేషంగా పాల్గొని వేదవర్ధన తీర్థ స్వామి ఆశీర్వచనాలు అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మండపాల వీధిలోని రాఘవేంద్రస్వామి మఠం అధ్యక్షుడు రంగబాబు, కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్టానం నిర్వాహకుడు కేఎస్ శ్రీధరాచారి, సింహపురి మధ్వ సంఘం అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను వ్యాసరాజ మఠం గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షుడు అర్వపల్లి సుబ్బారావు, మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట) : కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ధర్నాలో భాగంగా వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఓల్డ్ పింఛన్ స్కీమును అమలు చేయాలని, కృష్ణపట్నం పోర్టులో కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.నాగేశ్వరరావు, పెంచలయ్య, సురేష్, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పౌష్టికాహార ప్యాకెట్లు అందుకున్న చిన్నారులతో ట్రస్టు ప్రతినిధులు


నెల్లూరు(బారకాసు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ మాధవి అన్నారు. స్థానిక కొండాయపాళెం ప్రాంతంలో ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని, మాట్లాడారు. అనాథలు, బడుగు బలహీనవర్గాల వారికి ప్రభుత్వం ఎన్నో ఆర్థిక సదుపాయాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని ఉపయోగించుకుని విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ చైర్మన్ నిర్మలకుమార్ ప్రతినెలా 200 మందికి రూ.1,500 చొప్పున న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుసుమకుమారి, రెవరెండ్ డేవిడ్ విల్లింగ్టన్, జయప్రకాష్, విలియమ్స్, మరియమ్మ, దయాకృప, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖ ఆదర్శంగా నిలవాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(పొగతోట) : అన్ని ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖ కీలకమైనదని, దీని ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఇతర శాఖలకు ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం పక్కన రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు (ఫిల్లింగ్ స్టేషన్)ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ బుధవారం ప్రారంభించారు.

మెట్టపంటల సాగుకు అనుకూలం



మండలంలో దుక్కిదున్నకం చేపట్టిన పొలాలు

- మిల్లెట్స్ సాగుకు ప్రోత్సాహం

పొదలకూరు : మండలంలో మెట్టపంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఇటీవల తరచూ వర్షాలు కురుస్తుండడంతో రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ ప్రాంతంలో విస్తారంగా మినుము సాగు చేపట్టే రైతులు కొంతకాలంగా సాగు విస్తీర్ణం తగ్గింది. అయితే జూలై, ఆగస్టు మాసంలో స్వల్పంగా వర్షాలు కురిసినా రైతులు మెట్టపంటల సాగుకు ముందుగానే దుక్కిదున్నకం పనులు పూర్తిచేసుకునే యోచనలో ఉన్నారు. వర్షం కురిస్తే వెంటనే స్వల్ప విస్తీర్ణంలో పప్పుధాన్యాల సాగు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాది పెసర, కంది, పచ్చిశనగ, జొన్న పంటల సాగు చేసే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే పొలాలను దుక్కిదున్నితే వర్షపు నీరు బాగా ఇంకిపోయి పొలాలు పదునెక్కుతాయని రైతులకు వ్యవసాయాధికారులు చెపుతున్నారు.

తృణధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

మండలంలో తృణధాన్యాల(మిల్లెట్స్) సాగును వ్యవసాయశాఖ ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నా, సన్నకారు రైతులకు విత్తన్నాల కిట్స్‌ను ఉచితంగా అందజేస్తోంది. తృణధాన్యాలు ఆరోగ్యానికి మంచిది కావడం వల్ల పట్టణ ప్రాంతాల్లో వాటికి డిమాండ్ బాగా ఉంది. కొర్రలు, రాగులు, అరికెలు, సాములు, ఊదలు, వరిగలు, సజ్జలు, జొన్నలు అందుబాటులో ఉన్నాయి. రైతులు తృణధాన్యాల సాగుపై దృష్టి సారించాల్సిందిగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లపై సర్వే చేయాలి

- ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్



ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

కొడవలూరు: వ్యక్తిగత మరుగుదొడ్లపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికీ విధిగా వెళ్లాలన్నారు. ఆ ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి సౌకర్యం ఉందా.. లేదా? పరిశీలించాలన్నారు. ఒకవేళ ఉంటే ప్రభుత్వం మంజూరు చేసిందా? లేక సొంతంగా నిర్మించుకున్నరా పరిశీలించాలన్నారు. అదేవిధంగా మరుగుదొడ్డి ఉన్న వారు వినియోగిస్తున్నారా లేదా కూడా పరిశీలించాలని చెప్పారు. అసలు మరుగుదొడ్డి సదుపాయం లేకపోతే కారణాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్డికి దరఖాస్తు చేసుకున్నారా లేదా కూడా ఆరా తీయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాకుంటే ఎందుకు మంజూరు చేయలేదో కూడా తెలుసుకోవాలని సూచించారు. త్వరితగతిన సమగ్ర సర్వే పూర్తి చేసి సమర్పిస్తే ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర సర్వే చేపడుతోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల వాగు ఆక్రమణపై పరిశీలన



వాగును పరిశీలిస్తున్న జలవనరులశాఖ అధికారులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో ఆక్రమణలకు గురైన పొట్టేళ్ల వాగును జలవనరులశాఖ ఈఈ నాగరాజు ఇతర అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు పక్కన ఉన్న లేఅవుట్లలో ఏ మేరకు ఆక్రమణలకు గురై ఉందో సమగ్ర వివరాలు సేకరించేందుకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మీడియాతో మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పొదలకూరుకు చెందిన వ్యక్తి ఇక్కడి వాగు కబ్జాకు గురైనట్లు వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాగును పరిశీలించేందుకు వచ్చామన్నారు. మండల సర్వేయర్ ద్వారా రెండు నుంచి మూడు రోజుల్లో వాగు స్వరూపాన్ని గుర్తిస్తామని తెలియజేశారు. ఈఈ వెంట డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ అనిల్ కుమార్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో ఉషాలావణ్య తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ జిల్లా నేత గోనె దయాకర్

కొడవలూరు : అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గోనె దయాకర్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యూటీ అమలు చేయాల్సి ఉందన్నారు. ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పెన్షన్, పీఎఫ్, ఈఎస్‌ఐలను అమలు చేయాలన్నారు. మినీ వర్కర్‌లను మెయిన్ వర్కర్‌లుగా గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలకు సహాయకులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా అంగన్‌వాడీలకు అన్యాయం చేస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు తలారి నరసింహం, ఎస్.సురేష్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.విజయమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున అన్నారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల పాలిట శాపంగా మారిన మూడు లేబర్ చట్టాలను రద్దు చేయాలన్నారు. అసంఘటిత కార్మికులను గుర్తించి వారి సంక్షేమం కోసం బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మనుబోలుకు కాకాణి రాక

మనుబోలు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గురువారం మనుబోలు మండల కేంద్రానికి రానున్నారు. మనుబోలు కోదండరామపురంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు.

ఇసుక కోసం అవస్థలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఇసుక కోసం కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో బుధవారం పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, టిప్పర్లు రావడంతో ట్రాఫిక్ ఏర్పడింది. రీచ్‌లో ఒకేఒక మెషీన్ ఉండటం వల్ల లోడింగ్ ఆలస్యమవుతోందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. గతంలో మూడు యంత్రాలతో లోడింగ్ చేసేవారు. ప్రస్తుతం ఒకే ఒక్క యంత్రంతో ఎలా లోడింగ్ అవుతుందని కొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. ఒక ఆధార్‌కార్డు మీద నలుగురు వ్యక్తుల పేర్లు నమోదు చేస్తుండటం వల్ల కూడా లోడింగ్ ఆలస్యమవుతోందని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని పెనుబల్లి గ్రామంలో పీర్లచావడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తామన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు రత్నం విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

నెల్లూరు (టౌన్) : ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీల్లో నెల్లూరులోని డా.కిశోర్స్ రత్నం స్కూల్ విద్యార్థిని జస్మిత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో స్థానిక రత్నం స్కూల్‌లో జస్మితను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ఎనిమిదో తరగతి చదువుతున్న జస్మిత అండర్-14 స్కేటింగ్ పోటీల్లో రింక్ -3, రోడ్-2 విభాగాల్లో వెండి పతకాలు, రింక్-2లో కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రసాయిలో కూడా రాణించి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల పాల్గొన్నారు.

తెలుగు టీచర్లను నియమించండి



పాఠశాల ఆవరణలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

- హిందీ టీచర్లు మాకొద్దు
- చంద్రశేఖరపురం ఈఎంఆర్‌ఎస్ విద్యార్థుల ధర్నా

కొడవలూరు : హిందీ టీచర్లొద్దు.. తెలుగు టీచర్‌లను నియమించాలని మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్‌ఎస్(ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్) పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తరగతులను బహిష్కరించి గురుకులం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈఎంఆర్‌ఎస్‌లను కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవడంతో హిందీ టీచర్లను నియమించారన్నారు. వీరు హిందీ బాషలో బోధించడం వల్ల పాఠ్యాంశాలు అర్థం కావడం లేదని వాపోయారు. ఆంగ్లంలోనూ పూర్తిస్థాయిలో బోధించడం లేదని చెప్పారు. ఆంగ్ల భాష పట్ల పూర్తిస్థాయి పట్టులేని ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. స్పష్టమైన ఇంగ్లిష్‌లో బోధన అర్థం కానప్పుడు తెలుగులో విశదీకరిస్తే అర్థం చేసుకోవచ్చని, కానీ హిందీలో విశదీకరిస్తున్నందున పాఠ్యాంశాలు అర్థం కావడం లేదన్నారు. తమకు టీసీలిస్తే మరో పాఠశాలలో చేరుతామని కోరుతున్నా ఇవ్వకుండా తిప్పుతున్నారని చెప్పారు. ఈ విధంగా చేస్తే విద్య కొనసాగడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో భోజనం కూడా పూర్తిగా పెట్టడం లేదని తెలిపారు. చాలి నంత భోజనం చేయడం లేదని, భోజనం అందని విద్యార్థులు వార్డన్‌ను ప్రశ్నిస్తే రసం తాగి పడుకోవాలని సూచిస్తున్నారని వాపోయారు. తెలుగు భాషలో బోధించే ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఇక్కడి ఈఎంఆర్‌ఎస్‌లో పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు కలిపి 480 సీట్లు ఉంటే 450 సీట్‌లు మాత్రమే భర్తీ అయ్యాయని, ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థుల సంఖ్య మరింత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుల నియామకం

స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో చంద్రశేఖరపురంలోని ఈఎంఆర్‌ఎస్‌లోని విద్యార్థుల సమస్యకు ఉపశమనం లభించింది. విద్యార్థుల చేస్తున్న ధర్నా గురించి తెలుసుకున్న ఆమె కలెక్టర్ ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల భవితను దృష్టిలో పెట్టుకుని తెలుగు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థనపై స్పందించిన కలెక్టర్ ఏడుగురు తెలుగు ఉపాధ్యాయులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు భోజనం విషయంలో రాజీ పడవద్దని, సరిపడా భోజన వసతి కల్పించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు



నిల్వ ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని పలు దాబాలు, హోటళ్లలో ఆహార భద్రతాధికారిణి నీరజ, నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడి పరిస్థితులను చూసి నివ్వెరపోయారు. అపరిశుభ్ర వాతావరణం, ఆహారంలో నాణ్యత లేకపోవడం, నిల్వ ఆహార పదార్థాలు, చికెన్‌లో నిషేధిత రంగులు కలిపి ఉండటం గమనించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ పట్టణంలోని పలు దాబాలు, హోటళ్లను తనిఖీ చేసి యజమానులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అధిక శాతం హోటళ్లు, దాబాలకు కనీసం లైసెన్సులు కూడా లేవన్నారు. కల్తీ ఆహారం అందించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడటం సరికాదన్నారు. వారం రోజుల్లోపు అన్ని అనుమతులు తీసుకుని హోటళ్లను నడపాలని వివరించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు



మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

ముత్తుకూరు : సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మత్స్య రైతులు అధిక లాభాలు ఆర్జించి, అభివృద్ధి చెందాలని మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్, శాస్త్రవేత్త డాక్టర్ మాధవి అన్నారు. మండల కేంద్రమైన ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో బుధవారం జరిగిన జాతీయ మత్స్య రైతు దినోత్సవంలో వారు మాట్లాడారు. దివంగత డాక్టర్ హీరాలాల్ చౌదరి చేసిన కృషి వల్ల హేచరీల రంగం అభివృద్ధి చెందిందన్నారు. రైతులు సీడ్ ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు సరైన శిక్షణ పొంది మత్స్యశాస్త్ర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌ఏ డాక్టర్ ఆనందప్రసాద్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ అభ్యర్థుల ఆందోళన



ధర్నా చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ అభ్యర్థులు

నెల్లూరు(అర్బన్) : గతంలో హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో అవినీతి, అక్రమాలకు పాల్పడి తమకు అన్యాయం చేశారంటూ పలువురు అభ్యర్థులు సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందడంతో గుంటూరు రీజినల్ డైరెక్టర్ కార్యాలయ అధికారులు విచారణ చేయడానికి వస్తున్నారని తెలుసుకున్న వారు వైద్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ అభ్యర్థుల అసోసియేషన్ నాయకుడు బత్తల రత్నయ్య మాట్లాడుతూ 2002లో హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడిందన్నారు. తామంతా ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నామన్నారు. అయితే అప్పట్లో కోర్టు కేసుల నేపథ్యంలో పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత అందుకు సంబంధించిన పోస్టులను 2021-22 సంవత్సరంలో అప్పటి డీఎంహెచ్‌ఓ పోస్టులను భర్తీ చేశారన్నారు. ఈ ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని, రోస్టర్ ప్రక్రియ చేపట్టలేదని తెలిపారు. పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుని రహస్యంగా పోస్టులను భర్తీ చేశారన్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. దీనిపై అధికారులు పరిశీలించి తమకు నిబంధనల మేరకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశవులు, ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫెస్టివల్ కమిటీకి వక్ఫ్‌బోర్డు ఆమోదం



ఫెస్టివల్ కమిటీ ఉత్తర్వులు అందుకుంటున్న సాబీర్‌ఖాన్, అస్లాం

నెల్లూరు(బృందావనం) : మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు సంబంధించి ఫెస్టివల్ కమిటీకి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆమోదం తెలుపుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ చైర్మన్‌గా షేక్.ఖాదర్‌బాషాతో పాటు మరో 70 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అబ్దుల్ ఖదీర్ నుంచి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్, జిల్లా మైనార్టీ అధికార ప్రతినిధి షేక్.అస్లాం, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు షేక్.మునీర్‌బాషా బుధవారం అందుకున్నారు.